క్లుప్తంగా

పంటకోత ప్రయోగాలపై శిక్షణ



సూచనలిస్తున్న మండల వ్యవసాయాధికారి సుజాత

వై.రామవరం: మండలంలోని చవిటిదిబ్బలు గ్రామ రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం మండల వ్యవసాయాధికారి ఎం.సుజాత అధ్యక్షతన డీవైఎస్ జి. శ్రీదేవి పాల్గొని పంటకోత ప్రయోగాలపై రైతులకు, సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రయోగ క్షేత్ర ఎంపిక, పంటకోత ప్రయోగాలు చేసే విధానంపై అవగాహన కల్పించారు. పంటకోత ప్రయోగం ద్వారా దిగుబడి తగ్గి పంటనష్టం వాటిల్లితే ఆరైతులకు ప్రధానమంత్రి పసల్ బీమా పథకం వర్తిస్తుందన్నారు. ఏఎస్‌ఓ డి ప్రవీణ్ కుమార్, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పీసా ఉపాధ్యక్షుడు శివ

గంగవరం:ఇంటిని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పీసా ఉపాధ్యక్షుడు శివరామకృష్ణ , కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ భూముల లక్ష్మి గ్రామస్తులను సూచించారు. మండల కేంద్రమైన గంగవరంలో పలు వీధుల్లో వారు శుక్రవారం ఇంటింటా పర్యటించి తడి చెత్త, పొడి చెత్త గురించి అవగాహన కల్పించారు.

బోధనేతర పనుల బహిష్కరణ



చింతూరులో ఎంఈవో-2 వెంకటేశ్వర్లకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

చింతూరు: మండలంలోని పాఠశాలల్లో బోధనేతర పనుల కార్యక్రమాలను బహిష్కరించినట్టు ఉపాధ్యాయ సంఘాల సమైఖ్య నాయకులు తెలిపారు. ఈ మేరకు విద్యాశక్తి 2.0 వంటి సీజనల్ ప్రచార కార్యక్రమాలను చేపట్టమన్నారు. ఈ మేరకు వారు స్థానిక ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో-2 వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం, విద్యార్థులకు సంబంధించిన హాజరు వంటి పనులను మాత్రమే నిర్వహిస్తామన్నారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు కృష్ణయ్య, సుబ్బయ్య, ముత్తయ్య, బ్రహ్మయ్య, కృష్ణకుమారి, జయ, నాగేంద్ర, సుజాత పాల్గొన్నారు.

బక్కలపనుకులో తాగునీటి కష్టాలు



పైపులైన్ లీకేజీతో వృథాగా పోతున్న నీరు

పాడేరు రూరల్: పాడేరుపట్టణం బక్కలపనుకులో తాగునీటి కష్టాలు తీవ్రంగా మారింది. పలుచోట్ల పైపులైన్ లీకేజీతో తాగునీరు వృథాగా పోతుందని స్థానికులు రాజుబాబు, నాగేంద్ర, మహేష్‌లు శుక్రవారం తెలిపారు. గత పది రోజుల నుంచి తాగునీటి సరఫరా నిలిపివేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం



ఏడుగురాళ్లపల్లిలో స్థానికులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

చింతూరు: మండలంలోని ఏడుగురాళ్లపల్లిలో చింతూరు సీఐ గోపాలకృష్ణ, ఎస్‌ఐ రమేష్ శుక్రవారం పర్యటించారు. గ్రామంలో జరుగుతున్న వారపు సంతలో పర్యటించి, స్థానికులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మావోయిస్టులకు సహకరించొద్దన్నారు. మావోయిస్టుల ఉనికి తెలిస్తే తమకు తెలియచేయాలని, తెలిపిన వారిపేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. సైబర్ నేరాల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని, ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

ఆశల సాగు

- విస్తారంగా సామలు, రాగి, వరి పంటలు
- మార్కెట్‌లో గిరాకీ
- పెరుగుతున్న సాగు విస్తీర్ణం



తీగలవలసలో చోడి పంట



కామయ్యపేటలో వరి పంట

హుకుంపేట: ఏజెన్సీలో గిరిజన రైతులు ప్రధానంగా పండించే పంట వరితో పాటు చిరుధాన్యాలైన రాగి(చోడి), సామలు పంటల సాగు ఎక్కువగా చేస్తున్నారు. మన్యంలో పండించే చిరుధాన్యాలకు మైదాన ప్రాంతాల్లో డిమాండ్ ఉండడంతో ఆశాజకమైన ధరలు లభిస్తున్నాయి. దీంతో ఏటేటా వరితో పాటు చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెరుగుతూ వస్తోంది.

దళారుల బెడద

మండలంలోని తీగలవలస, తడిగిరి, మట్టుజోరు, రాప, మఠం, శోభకోట, కొట్నాపల్లి, బారమసి, బాకురు, సూకురు, అడ్డుమండ, మత్స్యపురం పంచాయతీల్లో పలు గ్రామల్లో ఈ ఏడాది ఈ పంట ఎక్కుగా సాగు చేశారు. మండలంలోని సుమారు 2వేల ఎకరాల్లో పంట సాగులో ఉంది. పలు ప్రాంతల్లో పంట కోత దశకు చేరుకుంది. ఈ ఏడాది మొదటి నుంచి వర్షాలు కురిసి వాతావరణం అనుకూలించడంతో తక్కువ సమయంలో పంట చేతికి అందివచ్చిందని పలువురు గిరిజన రైతులు చెబుతున్నారు. పండించిన పంటలను సంతల్లోనే ఎక్కువగా విక్రయిస్తున్నారు. అయితే దళారుల బెడద ఉండడంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం పెట్టుబడి సాయం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందేదని గుర్తు చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ద్వారా సాగుకు పెట్టుబడి సాయం అందడం లేదని చెప్పారు. ప్రభుత్వం వరి, చిరుధాన్యాల ఇతరత్రా పంటల సాగుకోసం పెట్టుబడి సాయం అందిస్తే మరి ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తామని రైతులు చెబుతున్నారు.

పెట్టుబడి సాయం అందక ఇబ్బందులు

రాగి(చోలు),సామలు పంటలు ఎక్కువగా పండిస్తున్నాం. ప్రభుత్వం సాయం అందకపోవడంతో పెట్టుబడికి, విత్తనాల కోసం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని రైతులు చెబుతున్నారు. ఆర్థిక స్తోమతకు తగట్టు సాగు చేసుకుంటున్నామని, దళారుల బెడద నుంచి అధికారులు కాపాడాలని వారు కోరుతున్నారు.

ప్రభుత్వం కొనుగోలు చేయాలి

రాగులు, సామలు పంటలు ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసినప్పటికి ఎటువంటి లాభాలు పొందలేకపోతున్నాం. సంతల్లో దళారి వ్యాపారస్తులకు అమ్మి మోసపోతున్నాము. ప్రభుత్వం దృష్టి పెట్టి ఆర్‌బీకేల ద్వారా సామలు, రాగులు కొనుగోలు చేయాలి.

– కిముడు దొర, రైతు.గరుడాపల్లి గ్రామం, హుకుంపేట మండలం

రైతులకు అవగాహన

రైతులు పండించిన రాగి, సామలను కొనుగోలు చేసేందుకు మండలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. కొద్ది రోజుల్లో రైతులకు తెలియజేస్తాం. దళారుల వద్ద మోసపోకుండా రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయాలు చేసేలా అవగాహన కల్పిస్తున్నాం. – కె.సుధాకర్, మండల వ్యవసాయశాఖ అధికారి, హుకుంపేట మండలం

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన



చింతపల్లిలో మాట్లాడుతున్న సర్పంచ్ పుష్పలత

చింతపల్లి: బాల్య వివాహాలతో ఎదురయ్యే అనర్థాలపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని సర్పంచ్ దురియా పుష్పలత అన్నారు. శుక్రవారం చింతపల్లి పంచాయతీ కార్యాలయ ఆవరణలో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న వయస్సులో వివాహాలు చేయడం వల్ల పుట్టబోయే బిడ్డలతో పాటు మహిళలు ఆరోగ్యం కూడా క్షీణించే అవకాశం ఉందన్నారు. ప్రతి గ్రామంలోను బాల్య వివాహాల అనర్థాలను, ఆశ, అంగన్‌వాడీ, ఏఎన్‌ఎంలు విధిగా అవగాహన పరచాలన్నారు.అనంతరం పంచాయతీ పరిధిలోని గడపరాయి గ్రామంలో ఆదికర్మయోగి అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించి గ్రామానికి సంబంధించిన అభివృద్ధి పనులపై చర్చించారు. పంచాయతీ కార్యదర్శి వెంకటరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కుంగిన కల్వర్టు.. రాకపోకలకు అవస్థలు



కాండ్రంగివలసలో దెబ్బతిన్న కల్వర్టు

ముంచంగిపుట్టు: మండలంలోని బాబుశాల పంచాయతీ కాండ్రంగివలస గ్రామ సమీపంలో కల్వర్టు శుక్రవారం కుంగిపోయింది. దీంతో సుమారు 30 గ్రామాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు నెలకొన్నాయి. గ్రావెల్ లోడ్‌తో వెళ్తున్న లారీ కాండ్రంగివలస గ్రామ సమీపంలో కల్వర్టు వద్దకు వచ్చేసరికి ఒక్కసారిగా కల్వర్టు కుంగిపోయింది. కేవలం ద్విచక్ర వాహనం మినహా మరే వాహనాలు వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది. కల్వర్టు సగభాగంగా పూర్తిగా కూరుకుపోయింది. కల్వర్టు నిర్మించి ఆరేళ్లు అయిందని, నాణ్యత లోపం కారణంగా కుంగిపోయిందని స్థానికులు చెబుతునానరు. దీంతో కుమడ, బాబుశాల, రూడకోట పంచాయతీలకు చెందిన 30 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి రాకపోకలు సాగే విధంగా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



జల్లూరిమెట్టలో మాట్లాడుతున్న సిడిపీవో శ్రీదేవి, పక్కన సూపర్‌వైజర్ సౌజన్య



ఆరోగ్యం శ్రద్ధపై గర్భిణులు, బాలింతలచే ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీవో సుచరిత ఆదిలక్ష్మి

చింతపల్లి: మండలంలోని జల్లూరిమెట్ల అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ మా కార్యక్రమంలో భాగంగా సీడీపీవో శ్రీదేవి శుక్రవారం స్థానిక గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారాన్ని తీసుకోవాలని దీంతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చన్నారు. అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గంగవరం: మండలంలోని సూరంపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీవో సుచరిత ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో పోషణ్ మా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్, సీడీపీవో సుచరిత మాట్లాడుతూ గర్భిణులు తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తమ రోజూ వారీ ఆహారంలో పోషక విలువలున్న వాటిని వినియోగించాలని సూచించారు. పౌష్టికాహారం, పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. అంగన్‌వాడీ కార్యకర్త రాఘవమ్మ, హెల్పర్ బుల్లియమ్మ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారం అందించాలి



మాట్లాడుతున్న ఎంపీటీసీ వంశీ కుంజం

రంపచోడవరం: మండలంలోని తామరపల్లి గ్రామంలో డ్రైడే –ఫ్రైడే కార్యక్రమాన్ని ఎంపీటీసీ కుంజం వంశీ నిర్వహించారు. గ్రామంలో నీళ్ల ఉన్న చోట యాంటీ లార్వా మందు స్ప్రేయింగ్ చేయించారు. వీధుల్లో బ్లీచింగ్ చల్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తామరపల్లి గ్రామానికి చెందిన కుంజం అబ్బాయిదొర ప్రకృతి సేద్యంలో ఉత్తమ రైతుగా ఎంపికైయ్యారని, గ్రామంలో మిగిలిన రైతులు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందజేయాలని నిర్వాహకులకు సూచించారు. స్టాక్‌ను పరిశీలించారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. పీసా కమిటీ ఉపాధ్యక్షుడు వేమన్న, కార్యదర్శి పాండు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలకు ప్రణాళిక



మాట్లాడుతున్న సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ స్వామినాయుడు

ముంచంగిపుట్టు: విద్యార్థుల అభ్యసన సామర్థ్యం మెరుగుకై తరాల్ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ స్వామి నాయుడు అన్నారు. మండల కేంద్రంలో స్థానిక బాలుర పాఠశాల–1లో ఉపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్వామి నాయుడు మాట్లాడుతూ విద్యార్థులకు ఉన్నత బోధన అందించాలని, ఉత్తమ ఫలితాల సాధనకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఎంఈవో కృష్ణమూర్తి, స్టేట్ రిసోర్స్ పర్సన్‌లు మహాలక్ష్మీ, తులసి, హెచ్‌ఎంలు, సిఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో వ్యాయామ ఉపాధ్యాయులు

ఎటపాక: రంపచోడవరంలో జరిగిన పాఠశాలల డివిజన్ స్థాయి పోటీల్లో ప్రతిభకనబర్చిన జిల్లా స్థాయి క్రీడా పోటీలకు మండలం నుంచి పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్ –17 కబడ్డీ పోటీలకు నందిగామపాడు విద్యార్థి కె.సుదీప్, వాలీబాల్ పోటీలకు కె.ఎన్.పురం నుంచి ఎం.చరణ్, ఎ.శివమణి ఎంపికయ్యారు. అండర్–14 విభాగంలో కబడ్డీకి నెల్లిపాక నుంచి విశ్వేశర, పినపల్లి నుంచి రేవంత్ ఎంపికయ్యారు. అండర్ –14 ఖోఖో పోటీలకు నెల్లిపాక నుంచి నాగచైతన్య, సీతాపురం నుంచి మోజెస్ ఎంపికైనట్టు పీఈటీ, పీడీలు రమేష్, లక్ష్మణరావు, అనిల్ తెలిపారు.

గృహ నిర్మాణాలకు భూమిపూజ



గృహ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీడీవో కుమార్

అడ్డతీగల: పిఎం జన్‌మన్ పథకాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఎ.వి.వి. కుమార్ అన్నారు. గృహాల గుర్తింపు, నిర్మాణ పనుల ప్రారంభ మేళా కార్యక్రమాన్ని మండలంలోని డి.భీమవరం, పులిగోగులపాడు, అడ్డతీగల పంచాయతీల్లో నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పీఎం జన్‌మన్ పథకంలో యూనిట్ కాస్ట్ రూ.2.39 లక్షలు కాగా అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.1 లక్ష నిధులను మంజూరు చేస్తుందన్నారు. ఈ మాసంలో నిర్మాణం మొదలు పెట్టిన గృహాలు డిసెంబర్ మాసాంతానికి పూర్తి చేయాలని లబ్ధిదారులకు తెలియజేశామన్నారు. లబ్ధిదారులను ఆయా గృహాలు నిర్మించే ప్రాంతాల్లో మార్కింగ్‌లు వేసి నిర్మాణాలు ప్రారంభింపచేశామన్నారు. గృహ నిర్మాణశాఖ ఏఈ శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వై.రామవరంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్‌ఐ రామకృష్ణ, సిబ్బంది



అరకు సంతలో స్థానికులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ పాపినాయుడు

డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని వారపు సంతలో స్థానికులతో పాటు ఆటో, ద్విచక్రవాహనచోదకులకు ఎస్‌ఐ కె.పాపినాయుడు శుక్రవారం పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనచోదకులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

వై.రామవరం: వై.రామవరం నుంచి మండల సరిహద్దు, లోతట్టు ప్రాంతాలకు వెళ్లే ప్రధానరహదారిలో శుక్రవారం స్థానిక ఎస్‌ఐ బి రామకృష్ణ ఆధ్వర్యంలో విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. రికార్డులు సక్రమంగా లేని వాహనాలపై కేసులు నమోదు చేశారు.

రహదారి మరమ్మతు కోసం డిమాండ్

రాజవొమ్మంగి: మండలంలోని గొంటువాని పాలెం వద్ద ఛిద్రమైన ప్రధాన రహదారి మరమ్మతు చేస్తామని ఇచ్చిన హామీని అధికారులు విస్మరించారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ధ్వజమెత్తారు. పార్టీ మండల కమిటీ సమావేశం మండలంలోని కేశవరం గ్రామంలో శుక్రవారం జరిగింది.

ఈ సంధర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సూరిబాబు, కార్యదర్శి వర్గ సభ్యులు రామారావు మాట్లాడుతూ ఈ రహదారి మరమ్మతు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ త్వరలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతున్నట్టు ప్రకటించారు. దీనికి ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, దొరబాబు, గంగరాజు, రాంబాబు, అచ్చారావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యం



సీహెచ్‌సీలో అవగాహన కల్పిస్తున్న సూపరింటెండెంట్ సతీష్

అడ్డతీగల: సమాజంలో ప్రతి ఒక్కరూ మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని అడ్డతీగల సీహెచ్‌సీ సూపరింటెండెంట్ పండా సతీష్ అన్నారు. అడ్డతీగల సీహెచ్‌సీలో శుక్రవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.మానసిక ఆరోగ్య సమస్యల గురించి అవగాహన పెంచడానికి ఇటువంటి కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు.అందరికీ అందుబాటులో ఉండే చికిత్స సామాజిక చేరిక హక్కును ప్రోత్సహిస్తూనే నిరాశ, ఆందోళన, ఇతర మానసిక సమస్యలు వంటి సవాళ్లను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆస్పత్రి కౌన్సిలర్ నారే వాసు అన్నారు. మనిషి జీవితంలో అనేక ఒత్తిడిలను తగ్గించడానికి యోగా, ధ్యానాలు, మనస్సు ప్రశాంతంగా ఉంచడానికి కౌన్సిలింగ్ సెంటర్లు సహాయపడతాయని వైద్యాధికారి ప్రసన్నదేవి అన్నారు.మానసిక ఆరోగ్యం పెంచుకోవడానికి స్నేహితులతో కలిసి మాట్లాడడం, కష్టాల్లో ఉన్నప్పుడు బాధలు పంచుకోవడం అంటూ చేయాలన్నారు. ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టల్ సేవలపై అవగాహన



పోస్టల్ సేవలను వినియోగదారులకు వివరిస్తున్న సబ్ పోస్టు మాస్టర్ శివ ప్రసాద్

గంగవరం : తపాలా బీమా, పొదుపు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సబ్ పోస్ట్ మాస్టర్ మోహన్ శివప్రసాద్ అన్నారు. స్థానిక ఉప తపాలా కార్యాలయంలో వారం రోజుల పాటు నిర్వహించిన జాతీయ తపాలా వారోత్సవాలు ఘనంగా శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. ఇందులో భాగంగా శుక్రవారం సబ్ పోస్ట్ ఆఫీస్ కార్యాలయం ఆవరణలో వినియోగదారుల దినోత్సవం (కస్టమర్ డే) నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్ట్‌మాస్టర్ మోహన్ శివప్రసాద్ మాట్లాడుతూ తపాలా సేవలను వినియోగదారులకు సమర్థవంతంగా అందిస్తున్నట్టు తెలిపారు. తపాలా శాఖ ఆధ్వర్యంలో అందించే బీమా, పొదుపు పథకాలు గురించి వినియోగదారులకు వివరించారు. తపాలా సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలు కూడా తపాలా సిబ్బంది అందిస్తున్న సేవల పట్ల హర్షం వ్యక్తం చేశారు. పోస్టాఫీస్ అందజేస్తున్న సేవలపై తమ అభిప్రాయాలు (ఫీడ్‌బ్యాక్) లేఖ రూపంలో అందజేశారు. పోస్టల్ సిబ్బంది శ్రీను, గణేష్, బాబీ, శ్రీదేవి, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

జేఏసీ మండల సంఘం నూతన కార్యవర్గం



డుంబ్రిగుడలో నూతనంగా ఏర్పడ్డ సచివాలయ జేఏసీ యూనియన్

డుంబ్రిగుడ: మండలంలోని సచివాలయ జేఏసీ మండల యూనియన్‌ను శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడిగా అజయ్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్‌రావు, కార్యదర్శిగా వీరయ్య, కార్యనిర్వహణ కార్యదర్శిగా తులవతి, ట్రెజరర్‌గా రాంబాబు, సబ్ ట్రెజరర్‌గా మత్స్యరాజు, మండల కో–ఆర్డినేటర్లుగా భానుప్రకాష్, నవీన్, రమ్య, జీనబంధులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన సచివాలయ నుతన జేఏసీ అధ్యక్షుడు అజయ్ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై అవగాహన చేస్తు వాటి పరిష్కార మార్గాలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానన్నారు. సచివాలయం ఉద్యోగులను ఇతర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ఏమాత్రం వ్యత్యాసాలు చూపించకుండా సమానస్థాయిలో గౌరవించాలని కూటమి ప్రభుత్వానికి మనవి చేస్తున్నామన్నారు. ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్స్, పీఆర్‌సీను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మండల జేఏసీ యూనియన్ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా జేఏసీ జిల్లా కార్యదర్శి డి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

దాతల సాయంతో బోరు ఏర్పాటు



నర్సింగపేట ఆశ్రమ పాఠశాలలో ప్రారంభించిన హ్యాండ్ బోరు

కూనవరం: మండలంలోని నర్సింగపేట ఆశ్రమ హైస్కూల్ విద్యార్థులు వరదలు, వర్షాల కారణంగా మోటార్ పాడైంది. దీంతో విద్యార్థులు తీవ్ర తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హెచ్‌ఎం వీరభ్రమ్మ ఈ విషయాన్ని ఎంఈవో కె.లక్ష్మయ్య దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎంఈవో చొరవతో సమారిటన్ ఫర్ ద నేషన్ (ఎస్ఎఫ్‌టీఎన్) సంస్థ , వీకేర్ స్వచ్ఛంద సంస్థలు ప్రాజెక్ట్ సుజల పథకం కింద రూ. 2 లక్షల వ్యయంతో రెండు ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించి, ఒక హ్యాండ్ బోరు ఏర్పాటు చేశారు. వాటిని శుక్రవారం ఎస్ఎఫ్‌టీఎన్ సంస్థ వ్యవస్థాపకుడు రామ్‌కుమార్, హెచ్‌ఎం వీరభద్రమ్మ చేతుల మీదుగా ప్రారంభించారు. స్వచ్ఛంద సంస్థ వలంటీర్లు, ఉపాధ్యాయులు, మేనేజ్‌మెంటు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంట నష్టాలపై సర్వే



పెదార్కూరులో వరదలకు దెబ్బతిన్న వరి పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

కూనవరం: ఇటీవల సంభవించిన గోదావరి వరదలకు మండలంలో 680 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్టు ప్రాథమిక అంచనాలను బట్టి తెలిస్తుందని మండల వ్యవసాయ అధికారి సీహెచ్.దేవి అన్నారు. మండల పరిధిలోని పెదార్కూరులో నీట మునిగిన వరి చేలను శుక్రవారం తహసీల్దార్ కె.శ్రీనివాసరావుతో కలిసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు శనివారం నుంచి పంటనష్ట సర్వే నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రతీ సచివాలయం పరిధిలో ఒక గ్రామస్థాయి కమిటీ చొప్పున మండల వ్యాప్తంగా 11 గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అయా కమిటీలో గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ వ్యవసాయ సహాయకులు కలిసి వరద ప్రభావిత పంట పొలాల్లో ప్రభుత్వ నిబంధనలకు లోబడి 33 సెంట్లు కన్నా ఎక్కువ నష్టపోతే దానిని పంట నష్టంగా పరిగణించి, బాధిత రైతుల జాబితాను తయారు చేయాలని ఆదేశించాం. ఈనెల 16వ తేదీలోగా వివరాలు సేకరించి జాబితాలను తయారు చేసి రైతు సేవా కేంద్రాల్లో సామాజిక తనిఖీ నిర్వహించవలసిందిగాను 20వ తేదీ లోగా తుది జాబితాను మండల కార్యాలయానికి సమర్పించ వలసిందిగా ఆదేశించినట్టు తెలిపారు.

సులభతర బోధనకు శిక్షణ దోహదం



చింతపల్లిలో శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో బ్రహ్మాజీరావు



గంగవరంలో మాట్లాడుతున్న ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు, ఎంఈవో మల్లేశ్వరరావు

చింతపల్లి : విద్యార్థులకు సులభతరంగా బోధన జరపడానికి ఉపాధ్యాయులకు టీఎఆర్ఎల్ శిక్షణ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు అన్నారు. శుక్రవారం చింతపల్లిలో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. విద్యార్థుల్లో తెలుగు, గణితంతో క్షీణించిన అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడానికి ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు.

గంగవరం : స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమబాలికోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న టీఆర్ఎల్ ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాన్ని ఏజెన్సీ డీఈఓ వై.మల్లేశ్వరరావు పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులందరూ ఈ శిక్షణను వినియోగించుకొని పాఠశాల స్థాయిలో విధిగా అమలు పరచాలని ఏజెన్సీ డీఈవో వై. మల్లేశ్వరరావు తెలిపారు. ఏటిడబ్ల్యూఓ కృష్ణ మోహన్, ఎంఈఓ 2. టి.మల్లేశ్వరరావు , సీఆర్పీ వరప్రసాద్ , డీఆర్పీలు రఘుబాబు, రామచంద్ర రెడ్డి, వెంకన్న దొర, దామోదర్ పాల్గొన్నారు.